క్లుప్తంగా

గంగమ్మ ఆలయానికి భారీ ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న అధికారులు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జాతర సందర్భంగా అమ్మవారి శాశ్వత హుండీ ద్వారా రూ.36,31,957 కానుకలు లభించినట్లు ఆలయ ఈఓ జయకుమార్ తెలిపారు. గురువారం అమ్మవారి ఆలయంలో అమ్మవారి హుండీ కానుకలను లెక్కింపు చేపట్టారు. ఇందులో నగదుతో పాటు 36.9 గ్రాముల బంగారు, 201.6 గ్రాముల వెండి లభించింది. అలాగే జాతర సందర్భగా సేవా టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.10,69,750 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఈస్ట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఈసెట్ ఫలితాల్లో సాయిమేధ హవా



మెట్ట దివాకర్, మద్దూరి వినయ్, పల్లెటి రాజశ్రీ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీఈసెట్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని సాయిమేధ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. ఈ ఫలితాల్లో మెట్ట దివాకర్ ఈఈఈ విభాగంలో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు, మద్దూరి వినయ్ 5వ ర్యాంకు, పాలమరొట్టి పవన్‌స్వామి 7వ ర్యాంకు, చిర్రికార్తిక్ 8వ ర్యాంకు, కె.సత్యచంద్ర 19వ ర్యాంకు, కొరివిపల్లి వంశీ 20వ ర్యాంకు, తిరగటి బాలవెంకట సురేష్ డీఎంఈ విభాగంలో 5వ ర్యాంకు, గురువు బాలకృష్ణ 10వ ర్యాంకు, మందాడి ప్రత్యూష 11వ ర్యాంకు, బి.యువతేజ 14వ ర్యాంకు, డి.వెంకటనరసింహమూర్తి 17వ ర్యాంకు, పల్లెటి రాజశ్రీ సీఎస్ఈ విభాగంలో 5వ ర్యాంకు, ఎం.కృష్ణసత్య 24వ ర్యాంకు, జి.కీర్తన 25వ ర్యాంకు, లోకేష్ 28వ ర్యాంకు, కింజారపు ప్రతాప్ ఈసీఈ విభాగంలో 6వ ర్యాంకు సాధించారు. ఆ మేరకు విద్యాసంస్థల చైర్మన్ రమణ, డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

సిద్ధ పురుషుడు అన్నమయ్య



ప్రసంగిస్తున్న కారుపోలు వెంకటపతి స్వామి

తిరుపతి, అన్నమయ్య సర్కిల్: శ్రీవేంకటేశ్వర స్వామి నందకాంసంగా జన్మించిన సిద్ధపురుషుడు అన్నమయ్య అని వైజాగ్‌కు చెందిన శ్రీకనకదుర్గమ్మ ఆలయ విశ్రాంత ఉద్యోగి కారుపోలు వెంకటపతిస్వామి తెలిపారు. తాళ్లపాక అన్నమాచార్యులు 617వ జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక అన్నమాచార్య కళామందిరంలో జరిగిన సాహితి సదస్సులో ఆయన అధ్యక్షత వహించి అన్నమయ్య సంకీర్తనలు–సంగీత సంప్రదాయం అనే అంశంపై ప్రసంగించారు. అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా ఓలలాడిస్తూ ఇటు భక్తి ప్రపంచానికి, అటు వా/ఙ్మయ ప్రపంచానికి అనుశాసనకర్తగా మారారని కొనియాడారు. చెన్నైకి చెందిన డీజీ వైష్ణవ కళాశాల విశ్రాంత తెలుగు శాఖాధిపతి డాక్టర్ కాసల నాగభూషణం ప్రసంగిస్తూ అన్నమయ్య పదాల్లో కవితా లాలిత్యం ఉంటుందన్నారు. అన్నమయ్య పద కవితలో కవితా మాధుర్యం, సౌందర్యం వంటి గుణాలతో పాటు లాలిత్యం గోచరిస్తుందన్నారు. ఎస్వీయూ ప్రాచ్య పరిశోధనా సంస్థ అధ్యాపకులు డాక్టర్ పీసీ వెంకటేశ్వర్లు అన్నమయ్య సంకీర్తనలు–ఆచార వ్యవహారాలు అనే అంశంపై విశదీకరించారు. శ్రీపద్మావతి మహిళా విశ్వ విద్యాలయం అధ్యాపకురాలు డాక్టర్ యువశ్రీ అన్నమయ్య పోతనలపై ప్రసంగించారు. రాత్రి 7 గంటలకు జరిగిన అన్నమాచార్య ప్రాజెక్టు విశ్రాంత గాయకులు శ్రీ వేదవ్యాస ఆనంద్ భట్టర్ బృందం సంగీత సభ, అనూరాధ బృందం హరికథ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు

తిరుపతి లీగల్: లారీని నిర్లక్ష్యంగా నడిపి ఓ వ్యక్తి మృతికి కారకుడైన లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి ఆరో అదనపు ప్రత్యేక మేజిస్ట్రేట్ కోర్టు గురువారం తీర్పు చెప్పారు. తిరుపతి ఈస్ట్ డీఎస్పీ భక్తవత్సలం, సీఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్ అయ్యప్ప తెలిపిన వివరాల మేరకు.. 2017 ఆగస్టు ఒకటో తేదీ తిరుపతి మున్సిపల్ మార్కెట్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద డ్రైవర్ కృష్ణ బియ్యం లోడుతో 12 చక్రాల లారీని యూటర్న్ చేశాడు. ఆ సమయంలో వైఎస్సార్ విగ్రహం వద్ద ఉన్న ప్లాట్‌ఫాంపై 55 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి కూర్చుని ఉండగా అతని కాళ్లపై లారీ చక్రం వెళ్లడంతో తీవ్ర రక్త గాయాలయ్యాయి. చుట్టుపక్కల ప్రజలు 108 అంబులెన్స్‌లో రుయా ఆస్పత్రికి అతన్ని తరలించారు. అయితే లారీ డ్రైవర్ పరారయ్యాడు. గాయాల పాలైన వ్యక్తి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 2017 ఆగస్టు 2వ తేదీ మృతి చెందాడు. ట్రాఫిక్ కానిస్టేబుల్ టీవీ శ్రీధర్ ప్రత్యేక ఫిర్యాదుతో ఈస్ట్ పోలీసులు డ్రైవర్ కృష్ణపై కేసు నమోదు చేశారు. రెండు రోజుల తర్వాత లారీ యజమాని డ్రైవర్‌ను తీసుకొచ్చి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. పోలీసులు డ్రైవర్ కృష్ణను కోర్టులో హాజరు పరచగా నేరం అతడిపై రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ప్రేమ్‌సాగర్ వాదనలు వినిపించారు.

టేస్టీ వడియాలు



ఎండలు ఓ పక్క పలువురిని భయపెడుతుంటే.. మరో పక్క గృహిణులకు చాలా చక్కగా ఉపయోగపడుతున్నాయి. ఎండ వేడిమి పెరిగే కొద్దీ తమలోని నైపుణ్యానికి పదునుపెడుతున్నారు. ఇంట్లో మిగిలిపోయిన అన్నంతోపాటు, పిండి, మైదా తదితరాలతో టేస్టీ వడియాలు తయారు చేస్తున్నారు. ఇలాంటిదే గురువారం తిరుపతి నగరంలో కనిపించింది. ఓ మహిళ వడియాలు పెడుతుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఓవర్ లోడు..



తిరుపతి నగరంలో ఓ టాటాఏస్ వాహనంలో పరిమితికి మించి మూటలను తీసుకెళ్తూ కనిపించాడు. అయితే అంత లగేజీ తీసుకెళ్తున్నప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఏంటి పరిస్థితి అని పలువురు వాహనదారులు అనుకుంటూ వెళ్లారు. అయితే నిబంధనలు పక్కన పెట్టి కొందరు వాహనదారులు ఇలా అధిక లగేజీ తరలిస్తున్నా ట్రాఫిక అధికారులకు కనిపించకపోవడం గమనార్హం. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

పల్లెలే టార్గెట్..

దొంగలు రూటు మార్చారు. ఇప్పటి వరకు పట్టణాలనే టార్గెట్‌గా చేసుకున్న వారు ప్రస్తుతం పల్లెల వైపు దృష్టి మళ్లించారు. గతంలో రాత్రిళ్లు మాత్రమే దొంగతనాలకు పాల్పడేవారు. ఇప్పుడు పట్టపగలే స్వైర విహారం చేస్తున్నారు. పల్లెల్లో సాధారణంగా ప్రజలు పగటిపూట పనులకు వెళ్తున్నారు. ఇంటిలో ఎవరూ లేని సమయం చూసి ఇంటి తాళాలు పగులగొట్టి దొరికిన కాడికి నగదు, విలువైన బంగారం, వెండి ఆభరణాలతో ఉడాయిస్తున్నారు. దీంతో పేదలు దొంగల భయంతో ఇంటి దగ్గర నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

- పట్టణాలను విడిచి రూటు మార్చిన దొంగలు
- సీసీ కెమెరాలు లేకపోవడమూ ఒక కారణం
- అంతంతమాత్రంగా పోలీసుల గస్తీ
- పల్లెనిద్రతో ప్రయోజనం ఎంత ?
- రాత్రివేళ భయంభయంగా నిద్రిస్తున్న పల్లెవాసులు

పుదిపట్లలో ఓ ఇంటిలో చిందరవందరగా వస్తువులు



చోరీ జరిగిన ఇంట్లో దొంగల వేలిముద్రలు సేకరణ



తిరుపతి రూరల్ : పల్లె జనం దొంగల దాటికి బెంబేలెత్తుతున్నారు. పగటి వేళ పనులకు వెళ్లగానే దొంగలు తమ పని కానిచ్చేస్తున్నారు. పోలీసులు అడపాదడపా వచ్చి మీటింగ్‌లు పెట్టి వెళ్లిపోతుండడంతో చోరులు తమ కానిచ్చేస్తున్నారు. వేసవి ముగిసేంత వరకైనా పగలూ రాత్రి పల్లెల్లో నిఘాను పెంచాలని, దొంగతనాలు జరగకుండా అడ్డుకోవాలని పల్లెజనం వేడుకుంటున్నారు. తిరుపతి రూరల్ మండలం పల్లెల్లో వేసవి ప్రారంభం నుంచే దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. గత మూడు నెలలుగా పలు గ్రామాల్లో దొంగలు స్వైర విహారం చేస్తూ చేతికి అందినంతా దోచుకుంటున్నారు. చోరీ జరిగిన తరువాత విలువైన బంగారం, నగదు పోగొట్టుకున్న బాధితులు పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు.



మల్లంగుంటలో చోరీ చేసిన ఇల్లు ఇదే..



పల్లెనిద్రలో భాగంగా గ్రామస్తులకు పోలీసుల అవగాహన

సాంకేతికతకు దూరంగా..

గతంలో దొంగతనాలు జరిగితే మొబైల్ ఫోన్ల ఆధారంగా కనుగొనేవారు. అయితే దొంగలు తెలివిగా సెల్‌ఫోన్లు వెంట తెచ్చుకోకుండా బైక్‌లపై వచ్చి పని ముగించుకుని ఉడాయిస్తున్నారు. పగటి పూట పక్క గ్రామంలో చుట్టాల ఇంటికి వచ్చినట్లు కలరింగ్ ఇస్తూ, ఎవరికీ అనుమానం రాకండా సంచరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. ముఖాలకు ముసుగులు ధరించి చేతులకు గ్లౌజులు వేసుకుని ఎక్కడా వేలిముద్రలు కూడా దొరకకుండా అత్యంత జాగ్రత్తలు పాటిస్తున్నారు. చాలా పోలీస్‌స్టేషన్లలో దొంగతనాలు జరిగి నెలల గడుస్తున్నా.. రికవరీ కాక.. అధిక సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉండడంతో పోలీసు ఉన్నతాధికారులు సైతం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

పల్లె వాసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పట్టపగలు తలుపునకు తాళం వేయకుండా ఇంట్లో ఎవరినైనా ఉంచాలి. తప్పనిసరి వెళ్లాల్సి వస్తే ఇరుగు, పొరుగు వారికి చెప్పి వెళ్లాలి. ఇంట్లో ఏదైనా అలికిడి జరిగేటప్పుడు సెల్‌ఫోన్‌కు సంకేతాలు వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలి. విలువైన వస్తువులు, బంగారం, వెండి వంటివి బయటకు వెళ్లేటప్పుడు ఇంట్లో ఉంచకపోవడం మంచిది. గ్రామంలో అపరిచితులు ఎవరైనా ప్రవేశిస్తే, వెంటనే పోలీసులకు పక్క గ్రామాల ప్రజలు అందరికీ సమాచారం చేరవేయాలి.

మూడు నెలల్లో జరిగిన చోరీల వివరాలు

- ఫిబ్రవరి 25వతేదీన గాంధీపురం పంచాయతీ మిలిటరీ కాలనీలో నివాసం ఉంటున్న జగదీశ్వర నాయుడు ఇంట్లో దొంగలు బంగారం, నగదు దోచుకెళ్లారు.
- మార్చి12వ తేదీ ఓటేరు పంచాయతీ అంబేద్కర్ కాలనీలో పుచ్చకాయలు అమ్ముకుని జీవనం సాగించే ఓ ముసలమ్మ ఇంటికి వెళ్తుండగా పట్టపగలు ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలోని 40 గ్రాముల బంగారం గొలుసు లాక్కుని వెళ్లారు.
- మార్చి25వ తేదీ తిరుమలనగర్ పంచాయతీ తుడా క్వార్టర్స్ ఎల్‌బిజీ లేఅవుట్‌లోని 296 ప్లాటులో ఇంటి గ్రిల్స్ విరిచి పట్టపగలు 50 గ్రాముల బంగారం, 200 గ్రాముల వెండి, 20 వేలు నగదు దోచుకువెళ్లారు.
- ఏప్రిల్ 10వ తేదీన పేరూరు పంచాయతీ హరిపురం కాలనీలో రెండవ అంతస్తులో నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి 30 గ్రాముల బంగారం తాళిబొట్టు లాక్కుని, రెండు సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు.
- మే12వ తేదీన మల్లంగుంటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జగదీశ్వర్‌రెడ్డి ఇంట్లో ఆయన తల్లి నరేంద్ర కుమారి నిద్రిస్తుండగా చడీచప్పుడు లేకుండా వచ్చి 90 గ్రాముల బంగారం దోచుకువెళ్లారు.
- ఏప్రిల్13వ తేదీన పుదిపట్ల పంచాయతీకి చెందిన పద్మావతి తిరుమలలోని ఓ ప్రైవేటు హోటల్‌లో పని చేస్తుంది. ఆమె ఇంటి గడియను దొంగలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు.

ఆర్ఎంఎస్ సేవల నిలిపివేతపై ఆందోళన

- ఎంపీ గురుమూర్తి కేంద్రానికి లేఖ



తిరుపతి మంగళం : రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో టీపీ–25 ఆర్ఎంఎస్ విభాగాన్ని నిలిపివేసిన కేంద్ర తపాలా శాఖ నిర్ణయంపై తిరుపతి ఆర్ఎంఎస్ డివిజన్‌కు చెందిన పోస్టల్ ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్పు తిరుపతి ప్రాంతంలో తపాలా సేవలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వారు అభిప్రాయపడ్డారు. మౌలిక సదుపాయాలు, వ్యూహాత్మక ప్రాధాన్యత ఉన్న తిరుపతి ఆర్ఎంఎస్ డివిజన్‌కు ఈ నిర్ణయం అన్యాయమన్నారు. ఈ మేరకు ఉద్యోగులు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తికి వినతిపత్రం సమర్పించారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన గత నెల 18వ తేదీన కేంద్ర తపాలా, కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. ఈ లేఖపై తపాలా శాఖ కార్యదర్శి స్పందిస్తూ ఈనెల 13వ తేదీ ఎంపీ గురుమూర్తికి వివరణ ఇస్తూ లేఖ రాశారు. టీపీ–25 ఆర్ఎంఎస్ విభాగం తపాలా మార్పిడికి పరిమిత స్థాయిలోనే ఉపయోగపడుతోందన్నారు. తిరుపతి–సికింద్రాబాద్ స్టేషన్ల మధ్య మాత్రమే తపాలా మార్పిడి జరుగుతుందని తెలిపారు. తపాలా పంపిణీ వ్యవస్థ మరింత సమర్థవంతంగా, భద్రతగా ఉండేందుకు తిరుపతి–కడప–కర్నూలు–అనంతపురం, తిరుపతి–కర్నూలు–నంద్యాల–విజయవాడ–గుంటూరు మధ్య రెండు కొత్త అంతర్గత రోడ్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్ మార్గాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రోడ్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్ వాహనాలు లాక్ చేసి, సీల్ చేసిన విధానంతో పాటు జీపీఎస్ ట్రాకింగ్ సౌకర్యంతో కూడి ఉండి, తపాలా భద్రత, సమయపాలన మెరుగుపడుతుందన్నారు. తపాలా సేవల నాణ్యతపై ప్రభావం లేకుండా, ఈ కొత్త వ్యవస్థ వల్ల ప్రజలకు వేగవంతమైన, విశ్వసనీయమైన సేవలు అందుతాయని కేంద్ర తపాలా శాఖ స్పష్టం చేసింది.

ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ పరిశీలన



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న 16వ ఆర్థిక కమిషన్ సభ్యులు

తిరుపతి తుడా/రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం తూకివాకం సమీపంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను గురువారం 16వ ఆర్థిక కమిషన్ బృందం సభ్యులు సౌమ్య కంటి ఘోష్, సెక్రటరీ గౌతమ్ అల్లాడ పరిశీలించారు. వారికి ప్లాంట్‌లో ఘన, తడి చెత్త, కంపోస్టు ఎరువుల తయారీ, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ యూనిట్ల గురించి తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య వివరించారు. తిరుపతి నగరంలో సేకరించిన తడి, పొడిచెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రాసెసింగ్ చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు, తడి చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్, హోటళ్ల నుంచి వెలువడే వ్యర్థాల ద్వారా వంట గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. తిరుపతిలో రోజూ 25 టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలను ఆరు రకాలుగా గుల్ల, ఇసుకగా మారుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యామ్‌సుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, లైజన్ అధికారులు పాల్గొన్నారు.

పక్షిరాజుపై పరంధాముడు



గరుడవాహనంపై కల్యాణ వేంకటేశ్వరస్వామి

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పక్షి రాజైన గరుత్మంతుడిని వాహనంగా చేసుకుని స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మోహినీ అవతారంలో పల్లకిలో భక్తుల హారతులందుకున్నారు. వేకువ జామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజ, హోమశాలలో ప్రత్యేక పూజలు, తొలి గంట, దూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామివారిని మోహినీ అవతారంలో పల్లకిలో కొలువుదీర్చారు. అనంతరం స్వామివారికి స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు స్వామివారు గరుడ వాహనాన్ని అధిరోహించిన గ్రామ వీధుల్లో ఊరేగారు. రాత్రి 11 గంటలకు ఆస్థానం, శుద్ధి తదితర కార్యక్రమాలను పూర్తి చేసి, స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాలను డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ హరి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ హరికృష్ణ పర్యవేక్షించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారికి హనుమంత వాహన సేవ, సాయంత్రం వసంతోత్సవం, రాత్రి గజవాహన సేవలు జరగనున్నాయి.

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కె. నారాయణ, రామకృష్ణ

తిరుపతి కల్చరల్: దక్షిణ ఆసియా దేశాలపై ట్రంప్ పెత్తనమేమిటని, ఆయనకు భారత ప్రధాని తలొగ్గి వ్యవహరించడం ఏంటని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రశ్నించారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి నగరంలో ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను నిర్వహించడం శుభపరిణామమన్నారు. మహాసభల్లో ప్రధానంగా విద్య, ఉద్యోగ, ఉపాధి వంటి అంశాలపై చర్చించి నిర్దిష్టమైన అజెండాతో ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి వాటిని సాధనకు కృషి చేస్తామన్నారు. ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల సందర్భంగా తిరుపతి నగరంలో పెరియార్ సిద్ధాంతంతో కూడిన చిత్రపటాలను ఏర్పాటు చేస్తే పోలీసులు వాటిని తొలగించడం శోచనీయమన్నారు. పెరియార్ ద్రవిడ ఉద్యమానికి, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం చేసిన విషయం చంద్రబాబుకు బాగా తెలుసని, ఈ విషయంపై తక్షణమే స్పందించాలన్నారు.

బీజేపీ విధానాలతో రాజ్యాంగ సంక్షోభం

బీజేపీ రాజకీయ విధానాలతో భారత రాజ్యాంగం సంక్షోభానికి దారి తీసే ప్రమాదం పొంచి ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య 17వ జాతీయ మహాసభలు గురువా రం తిరుపతిలోని ఇందిరామైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు, నక్సలైట్లు, ఇతర వర్గాలతో రాజ్యాంగానికి నష్టం లేదని, బీజేపీ రాజకీయ విధానాలతోనే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. న్యాయవ్యవస్థను కూడా శాసించే స్థాయికి రాష్ట్రపతి వచ్చారంటే బీజేపీ విధానాలు ఏ స్థాయికి చేరాయో గుర్తించాలని సూచించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్య దర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లను తెలుగుదేశం పార్టీలో చేర్చుకుంటూ నీతిమాలిన రాజకీయాలను చేస్తున్నారని మండిపడ్డారు. టీటీడీ టిక్కెట్లు అమ్ముకునే శాసన మండలి వైస్ చైర్‌పర్సన్‌ను బీజేపీ తమ పార్టీలోకి చేర్చుకోవడం సిగ్గుమాలిన చర్య అని ఆరోపించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు సంతోషకుమా ర్, ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు సికిందర్ సింగ్, జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమల రామన్, ఏఐవైఎఫ్ జాతీయ ఆఫీస్ బేరర్స్ వలీ ఉల్లా కాదరి, ఖాదర్, సిన్హా, ప్రతాప్, లెనిన్‌బాబు, దినేష్ దిరాజ్, చంద్రబాబు, సీపీఐ రాష్ట్ర నేత హరినాథరెడ్డి, జిల్లా కార్యదర్శి మురళి, యువత పాల్గొన్నారు.

చదరంగంలో రాణి.. త్రిపురాంబిక



ఎఫ్ఐడీఈ(ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డెస్ ఈహెచ్ఎస్) వారు గురువారం ఆన్‌లైన్ నిర్వహించిన చదరంగం పోటీల్లో విజయం సాధించి ఎరీనా ఇంటర్నేషనల్ మాస్టర్‌ను విద్యార్థిని త్రిపురాంబిక కైవసం చేసుకుంది. తిరుపతి నగరంలోని మంచాల వీధికి చెందిన త్రిపురాంబిక గీతం స్కూల్‌లో 8వ తరగతి పూర్తి చేసింది. విద్యార్థినతి చదరంగంలో ప్రతిభ చూపుతోంది. ఎఫ్ఐడీఈ పోటీ విజేతలను గురువారం సాయంత్రం 5.30 గంటలకు ప్రకటించారు. ఈ ఏడాది జనవరిలో 13వ జాతీయ పాఠశాలల చదరంగం పోటీల్లోనూ 13 ఏళ్ల బాలికల విభాగంలో వెండి పతకాన్ని సాధించి త్రిపురాంబిక ప్రపంచ పాఠశాలల చదరంగం చాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధించింది. ఆమెను చెస్ కోచ్ కాకినాడ ప్రసాద్‌తో పాటు పలువురు చదరంగం క్రీడాకారులు అభినందించారు.

– తిరుపతి అర్బన్

నోటీస్ బోర్డు

- ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ వీర జవాన్లకు సంఘీభావంగా ఉదయం 8 గంటలకు ఎంఆర్‌పల్లి సర్కిల్ నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు తిరంగ ర్యాలీ
- గరుడ వారధి వార్షిక వసరుల తనిఖీల్లో భాగంగా ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు రామానుజ సర్కిల్ నుంచి శ్రీనివాసం కాంప్లెక్స్ వరకు గరుడ వారధిపై వారం రోజుల పాటు రాకపోకల నిషేధం
- రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో భవానీనగర్ ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసు ఎదురుగా చెంజి ప్లాజాలోని రోటరీ క్లబ్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు మెగా ఆక్యుప్రెజర్ వైద్య శిబిరం
- అన్నమయ్య 618వ జయంతోత్సవాల సందర్భంగా ఉదయం 10 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సు, సాయంత్రం 6 గంటలకు అన్నమాచార్య కళామందిరం, మహతి కళాక్షేత్రంలో భక్తి సంకీర్తనల కచేరీలు
- ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో భాగంగా ఉదయం 10 గంటలకు గంధమనేని శివయ్య భవన్‌లో ఏఐవైఎఫ్ ప్రతినిధుల సభ
- విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో వరదరాజనగర్‌లోని శ్రీబాలాజీ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ భవన్‌లో సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లపై సాయంత్రం 6 గంటలకు చర్చ కార్యక్రమం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 74,020 మంది స్వామిని దర్శించుకున్నారు. 31,190 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.27 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేసింది.

72 రుణాలకు దరఖాస్తులు

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మైనారిటీ కార్పొరేషన్ కింద 72 రుణాలను కేటాయించారని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కెనరా బ్యాంకు– 13, ఇండియన్ బ్యాంకు– 4, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు–3, పంజాబ్ నేషనల్ బ్యాంకు–3, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా–34, యుకో బ్యాంకు–1, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా–14, మొత్తం 72 టార్గెట్ కేటాయించారని తెలిపారు. ఈనెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు 3 సెట్లు అప్లికేషన్లు, డాక్యుమెంట్లను సంబంధిత సచివాలయంలో చేర్చాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, జైన్లు, పార్సీలు, క్రైస్తవ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ఆ ప్రకటనలో కోరారు.

నేటి నుంచి యోగా సమ్మర్ స్పెషల్ క్యాంప్

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ యోగా విజ్ఞాన విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి జూన్ 21వ తేదీ వరకు ప్రత్యేక యోగా సమ్మర్ స్పెషల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు. యోగాపై ఆసక్తిగల విద్యార్థులు, గృహిణులు, సీనియర్ సిటిజన్స్‌తో పాటు 12 ఏళ్లుదాటిన ఎవరైనా ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ రుసుము రూ.1500 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సంస్కృత పతంజలి యోగ సూత్రాలను అనుసరించి శాస్త్రీయ పద్ధతిలో ఆసనాలు, ప్రాణాయామం, క్రియల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. వివరాలకు 8712800169, 9346267582లలో సంప్రదించాలని కోరారు.